క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణ్‌శర్మతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నూతన సబ్‌కలెక్టర్ శివనారాయణ్‌శర్మని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



జేసీ నారపురెడ్డి మౌర్య చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న అభిలాష్ రెడ్డి

గోనెగండ్ల: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థి అభిలాష్ రెడ్డి ప్రతిభ చాటుకున్నాడని ప్రిన్సిపాల్ షాహీనా పర్వీన్ తెలిపారు. వినియోగదారులు ప్రొటెక్షన్ ఈ కామర్స్ జిల్లా స్థాయి పోటీలలో 10వ తరగతి చదువుతున్న అభిలాష్ రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జేసీ నారపు రెడ్డి మౌర్య ఆ విద్యార్థికి అవార్డుతో పాటు రూ.వెయ్యి నగదు బహుమతి అందజేశారు. బహుమతి పొందిన విద్యార్థి అభిలాష్ రెడ్డిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభను మెరుగుపరుచుకోవాలి

మద్దికెర: ఈనెల 18వ తేదీన వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యక్తృత్వ పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు భవానీ, సాజిదా, బిందు జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించి శుక్రవారం జాయింట్ కలెక్టర్ మౌర్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ప్రిన్సిపాల్ సవిత ప్రత్యేకంగా అభినందించారు.

కంప్యూటర్, ప్రింటర్ విరాళం



మూసానపల్లి పాఠశాలకు విరాళం అందిస్తున్న రాయచోటి సుబ్బయ్యశెట్టి

ఆలూరు: స్థానిక ఎంపీపీ పాఠశాలకు రూ.2 లక్షలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్ మిషన్‌ను శుక్రవారం ఆదోని మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయ కార్యదర్శి రాయచోటి సుబ్బయ్యశెట్టి విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి, మహాయోగి లక్ష్మమ్మవ్వ జన్మస్థలమైన మూసానాపల్లి గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. గ్రామ సర్పంచ్ పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ లింగారెడ్డి, రామయ్య, శంకరయ్య స్వామి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

24న కబడ్డీ పోటీలు

దేవనకొండ: క్రిస్మస్ పండగ సందర్భంగా మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ఏబీయం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజేతకు రూ.30 వేలను జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, రెండో బహుమతి రూ.20 వేలను వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కొత్తకాపు మధుసూదనరెడ్డి, మూడో బహుమతి రూ.10 వేలను నాయకుడు దాసరి లుముంబా, నాలుగో బహుమతి రూ.5 వేలను ఈరన్న, ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు అందించనున్నట్లు చెప్పారు. ఈ కబడ్డీ పోటీల్లో పాల్గొనే వారు 24వ తేదీలోపు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 96420 45942, 99665 58718 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

శనగలో పంటకోత ప్రయోగం



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

మద్దికెర: రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ పంట ఆశించినంతగా లేదని దిగుబడి అంతంత మాత్రంగానే ఉందని వ్యవసాయాధికారి రవి అన్నారు. శుక్రవారం మద్దికెర గ్రామ పరిసరాలలోని పప్పుశనగ పంట పొలాలలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. 5 మీటర్ల కొలతలో పంట కోత చేపట్టి దిగుబడిని తూకం వేయడం జరిగిందన్నారు. ఈ నివేదికలను జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. వీఏఏ జాకీర్, సిబ్బంది సుంకన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు తరలివస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, నాయకులు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



వైఎస్సార్‌సీపీ జెండాతో కార్యకర్త ఉత్సాహం



పార్టీ జెండాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

బడుగులకు సాధికారత



వైఎస్సార్‌సీపీ జెండాలు, మాస్క్‌లతో సందడి



సభకు హాజరైన ఎమ్మిగనూరు ప్రజానీకం



థ్యాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువత



జగనన్నకు మద్దతుగా ప్లకార్డు ప్రదర్శిస్తున్న మహిళ



జై జగన్ అంటూ నినదిస్తున్న యువత



సభావేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర బడుగు, బలహీన వర్గాల్లో భరోసా నింపింది. పట్టణంతో పాటు మండలం, గోనెగండ్ల, నందవరం మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక గంజిహళ్లి రోడ్డులోని శారద స్కూల్ సమీపం నుంచి నిర్వహించిన బస్సు యాత్రలో యువత జై జగన్ అంటూ నినదించగా, మహిళలు వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టి ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో సభావేదికపై మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీలు డాక్టర్ సంజీవ్‌కుమార్, గురుమూర్తి, గోరంట్ల మాధవ్‌లతో పాటు వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఆశీనులయ్యారు. భహిరంగ సభలో నేతల ప్రసంగాలకు జనం జై కొట్టారు. బడుగు బలహీన వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతను నేతలు వివరించడంతో ఆయా వర్గాలు సీఎం వైఎస్ జగన్‌కి జైకొట్టి మద్దతు తెలిపారు.

నందవరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగనన్న పాలన సాగిస్తున్నారని ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరులో సామాజిక సాధికార యాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సామాజిక సాధికారతను చేతల్లో చూపించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బతుకులు బాగుండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. యాత్రలో నందవరం మండలం నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్బీకే ప్రారంభోత్సవం





ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాలు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని కోటేకల్ పంచాయతీ పరిధిలోని చెన్నాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను శనివారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం

- రూ. 8 లక్షల వరకు ఆస్తి నష్టం



పూర్తిగా కాలిపోయిన ఇంట్లోని సామగ్రి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎల్లమ్మ బీడు కాలనీలో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు బోయ రాధ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న రాధ భయంతో పరుగున బయటకు వచ్చి కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు పక్కనున్న సుశీలమ్మ గుడిసెకు వ్యాపించాయి. మంటల్లో రెండు గుడిసెల్లోని సామగ్రి, బట్టలు, బియ్యం కాలిబూడిదయ్యాయి. కట్టుబట్టలతో రెండు కుటుంబాల వారు రోడ్డున పడ్డారు. ఒక్కొక్క గుడిసెలో రూ. 4 లక్షలు చొప్పున రూ. 8 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రూ. 10 వేలు ఆర్థిక సాయం

అగ్నిప్రమాదంతో నష్టపోయి కట్టుబట్టలతో మిగిలిన రెండు కుటుంబాలకు ఖర్చుల కోసం అదే కాలనీకి చెందిన ఎల్లంబీడు లక్ష్మన్న, హనుమంతు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.

24న మసీదు ప్రారంభోత్సవం

గోనెగండ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన మసీదును ఈనెల 24వ తేదీన ప్రారంభించనున్నట్లు మతపెద్దలు మౌలానా మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ రఫీక్ తెలిపారు. శుక్రవారం మసీదు ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను మత పెద్దలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. మసీదు ప్రారంభానికి మత పెద్దలు హాజరవుతున్నట్లు తెలిపారు. ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రారంభోత్సవానికి వచ్చిన వారందరికీ భోజన సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఎస్ఎస్ మాబువలి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గద్దెరాళ్లలో ఫ్రైడే - డ్రైడే

దేవనకొండ: మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో శుక్రవారం ఫ్రైడే– డ్రైడే కార్యక్రమాన్ని దేవనకొండ పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌లు రంగస్వామి, శ్రీధర్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం ఉద్దేశం గురించి తెలియజేశారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోరాదన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

హొళగుంద: మాదాసి, మాదారి కురువలను ఎస్టీలుగా గుర్తించి న్యాయం జరిగేంత వరకు పోరాటాలు సాగిద్దామని ఆ సంఘం మండల గౌరవాధ్యక్షుడు కాశికాప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెద్యాట మల్లయ్య, కోగిలతోట శేషప్ప, ఎల్లార్తి దర్గన్న, ఎండీ హళ్లి సుధాకర్ తదితరులు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు హొళగుందలో కురువల సమావేశం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న ఆలూరులో జరిగే మాదాసి కురువ మాదారి కురువ మహా సింహ గర్జనను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో లక్షల సంఖ్యలో కురువలు ఉన్నారని అయితే ఏ రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదాసి, మాదారి కురువలను ఎస్టీ జాబితాలో చేర్చి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు గర్జప్ప, గాది, పంపా, చంద్రశేఖర్, సర్దార్, పేటప్ప తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

మద్దికెర: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులు, వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 8 గ్రామ పంచాయతీల పరిధిలో 816 పనులకు రూ.6,58,61,751 వెచ్చించామని పీఆర్ పనులకు రూ.1,54,10,419 ఖర్చు చేసినట్లు వివరించారు. గ్రామాలలో రైతులు తమ పొలాలలో ఫారం పాండ్‌లను తవ్వుకోడానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. నీటి కుంటలు తవ్వుకునేవారు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే పండ్ల తోటల పెంపకానికి ముందుకు రావాలన్నారు. అడిషనల్ పీడీ మాధవీలత, డీవీఓ భాస్కర్, జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీఓలు రవీంద్రనాథ్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం



ఆలయ వరండాను ప్రారంభిస్తున్న దాతలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన రంగనాథ స్వామి ఆలయం ముందు దాత తలారి హనుమంతురావు, శారద దంపతులు తల్లిదండ్రులు తలారి అచ్చమ్మ, అంజనయ్య జ్ఞాపకార్థం రూ.5 లక్షలతో నిర్మించిన వరండాను శుక్రవారం ప్రారంభించారు. స్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. దాతలు మాట్లాడుతూ.. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా, అలాగే వార్షిక బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి ఇతర కార్యక్రమాలు నిర్వహించేందు వరండాలో సౌకర్యంగా ఉంటుందన్నారు. పారా విశ్వనాథ్ (చిట్టెన్న), ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరిగౌడ్, వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు

వెల్దుర్తి(కృష్ణగిరి): సత్యపీఠంగా భావించే పచ్చలబండ కలిగిన మహిమాన్విత రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున 4.05 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం, ఉదయం 10.15 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందుని కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. అలాగే పాలుట్ల రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వృషభాలకు బండలాగుడు పోటీలు, మధ్యాహ్నం గుండు ఎత్తే పందెం, రాత్రి భజన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నారు.

ప్రగతి బాటలు

- గ్రామాల అభివృద్ధికి శరవేగంగా రహదారుల నిర్మాణం
- నియోజకవర్గంలో రూ.67 కోట్లతో 27 రహదారులు
- రూ.2.56 కోట్లతో ఆలూరు–హొళగుంద రోడ్డు నిర్మాణం
- మార్కెట్ యార్డు నిధులతో 15 రోడ్లు
- తీరిన ప్రయాణికుల కష్టాలు, హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నూతనంగా నిర్మించిన ఆలూరు-హొళగుంద రహదారి



ముద్దనగేరి సమీపంలో బీటీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న పీఆర్ అధికారులు



ఆలూరు మండలం గోనేహాల్‌కు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు



రూ.70 లక్షలతో హత్తిబెళగల్‌కు నిర్మించిన బీటీ రోడ్డు

ఆలూరు రూరల్: ఆలూరు–హొళగుంద మండలాలను కలిపే ప్రధాన రహదారి దెబ్బతిని గత పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఈ రహదారి అధ్వానంగా ఉన్నా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఈ మార్గంలో ఎల్లార్తిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన షేక్షావలి దర్గాకు వేలాది మంది భక్తులు నిత్యం వచ్చి వెళ్తుంటారు. సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.6 కోట్ల మార్కెట్ యార్డు నిధులతో 26 కి.మీ మేర బీటీ రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించింది.

- వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధికి పెద్దపీట వేశారు. రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామాల రోడ్లు రాకపోకలకు సౌకర్యంగా మారాయి. గతంలో ఏ గ్రామానికి వెళ్లినా గుంతలు తేలిన రోడ్లు కనపడేవి. మరమ్మతులకు నోచుకోని పాపాన పోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేయలేని అభివృద్ధిని నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపుతోంది. కొత్తగా నిర్మించిన రహదారులతో పాటు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయడంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి.

రూ.7.78 కోట్లతో రహదారుల నిర్మాణం

నియోజకవర్గంలోని 6 మండలాల్లో మార్కెట్ యార్డు నుంచి 15 రోడ్ల నిర్మాణానికి రూ.7.78 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మరిన్ని నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపిచామని త్వరలో ఆ నిధులు విడుదలవుతాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి, దేవనకొండ మండలాల్లో మార్కెట్ యార్డు నిధులతో 90 కి.మీ మేర 15 రోడ్ల పనులు రూ.7.78 కోట్లు నిధులు వెచ్చించి నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా గత 10 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఆలూరు–హొళగుంద రహదారిలో రూ.2.56 కోట్లతో 26 కి.మీ మేర రహదారిని గుంతలను పూడ్చి కొత్తగా బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఆలూరు నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి కింద రూ.67 కోట్ల నిధులతో 27 రహదారులను నిర్మించింది. దాదాపు 155 కిలో మీటర్ల పొడవున రహదారులను నూతనంగా నిర్మించారు. మరో 5 రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించగా ఆ నిధులు కూడా త్వరలో విడుదల అవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులు తొలగాయి



గతంలో సరైన రోడ్లు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డాం. వర్షాకాలంలో అయితే ఇబ్బందులు మరీ తీవ్రంగా ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం మా గ్రామం మీదుగా బీటీ రోడ్డు వేయడంతో ప్రయాణకష్టాలు తీరాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో రోడ్లు బాగుపడ్డాయి. ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి.

– సుధాకర్, సర్పంచ్, ముద్దనగేరి

ప్రయాణం సులువైంది



ప్రస్తుత ప్రభుత్వం గ్రామాలకు రహదారులు నిర్మించడంతో ప్రయాణం సులువైంది. గతంలో ఎల్లార్తి దర్గాకు వెళ్లేందుకు రోడ్డు బాగాలేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆటోలు, స్కూటర్లలో రావాలంటే భయపడే వాళ్లు. ఆలూరు నుంచి హొళగుంద వరకు రహదారి నిర్మించడంతో ఆ కష్టాలన్నీ తీరాయి.

– ఎస్.కె.గిరి, ఎల్లార్తి గ్రామస్తుడు

15 ఏళ్ల కల సాకారం



మా గ్రామం నియోజకవర్గ కేంద్రానికి 3 కి.మీల దూరంలో ఉంది. 15 ఏళ్ల క్రితం మా గ్రామానికి రోడ్డు వేశారు. అది పదేళ్ల క్రితం పాడైపోయింది. గత టీడీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. రాళ్లు తేలిన రోడ్డులో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత మా గ్రామ రహదారికి మహర్దశ వచ్చింది. ముఖ్యమంత్రి చొరవతో మా గ్రామ రహదారి బాగుపడింది. సీఎం మేలు మరువలేనిది.

– మహబూబ్ బాషా, హత్తిబెళగల్ గ్రామస్తుడు

30 నుంచి గ్రామాల్లో ప్రచారం

ఆలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో మంజూరు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఈనెల 30వ తేదీ నుంచి దేవనకొండ, ఆస్పరి మండలాల్లోని గ్రామాల్లో మొదటి విడతగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి కాపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. అందులో.. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని పేర్కొన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై టీడీపీ నేతలు పచ్చ మీడియా ద్వారా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టీడీపీ ప్రజలు ఎప్పుడో విస్మరించారని, వారు అధికారంలోకి రావడం పగటి కలేనని ఎద్దేవా చేశారు. అరికెర, ఆలూరులోని విభిన్న ప్రతిభావంతుల కేంద్రాలు, ఏపీ మోడల్ స్కూల్ తదితర పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల వినతి మేరకు ఆయన రూ.50 వేలు విలువ చేసే సమగ్రిని సమకూర్చారు. తనకు చేతనైనంత సాయం అందించేందుకు ముందుంటానని మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నందవరం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మయ్య హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలదిన్నెలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత పల్లెల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. గ్రామంలో అందరూ కలిసి మెలసి స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని తెలిపారు. గొడవలు సృష్టించేకుని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.